# వరంగల్ వాయిస్

*Evening Daily*

సంపుటి : 04 | సంచిక : 158
పేజీలు : 08 | వెల: రూ.5/-

బుధవారం
మార్చి 19, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




8లో..

## ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే బడ్జెట్

- అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టి విక్రమార్క
- శాసనమండలిలో ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్ బాబు
- అభినందనలు తెలిపిన మంత్రి కొండా సురేఖ

# పప్పు, బెల్లాలకేనా..?





వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధి చెరువుల్లోని నీరు కనిపించకుండా విస్తరించిన గుర్రపు డెక్కతోపాటు ఇతర వ్యర్థాలను తొలగించేందుకు సుమారు రూ.40 లక్షలతో కొనుగోలు చేసిన ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్షన్ (ఎఫ్ టీసీ) మిషన్ తుప్పుపడుతోంది. కొనుగోలు చేసిన కొత్తలో కంపెనీ ప్రతినిధులు ఏడాది పాటు దీనిని నడిపించడంతో పాటు స్థానికులకు శిక్షణ కూడా ఇచ్చారు. తర్వాత ఏమైందో కాని గత మూడు సంవత్సరాలుగా దీనిని మూలకు పడేశారు. దీంతో భద్రకాళి చెరువులో ఎఫ్ టీసీ వృథాగా పడి ఉంది. కోట్లాదిమంది భక్తులు హాజరైన మహా కుంభమేళలో కూడా అక్కడి ప్రభుత్వం ఎఫ్ టీసీ మిషన్ ఉపయోగించి నీటిలోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించడంలో విజయం సాధించింది. ఇతర ప్రాంతాల్లో కూడా ఈ మిషన్‌ను ఉపయోగించి సత్ఫలితాలు పొందుతున్నారు. కాని మన దగ్గర మాత్రం ఎఫ్ టీసీని వినియోగించిన పాపాన పోలేదు. దీంతో వడ్డేపల్లి, ఉర్సు చెరువు, కడిపికొండ, కాజీపేట బంధం తదితర చెరువుల్లో ఎక్కడి గుర్రపు డెక్క అక్కడే అన్నట్లుగా వ్యాప్తి చెందుతోంది. అయితే కొత్త వింత..పాత రోత అన్నట్లుగా బల్దియా పాలకవర్గం వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డివిజన్లలో అభివృద్ధిని అటకెక్కించి కోట్ల రూపాయలు వెచ్చించి వివిధ యంత్రాలను కొనుగోలు చేస్తున్నా వాటిని వినియోగించుకునే సామర్థ్యం కొరవవడంతో అవి వృథా అవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే పర్సంటేజీల కోసమే కొత్త వాటిని కొనుగోలు చేస్తున్నారంటూ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేస్తున్న ఎఫ్ టీసీ లాంటి అనేక మిషన్లు అధికారులు, పాలకవర్గం నిర్లక్ష్యంతో పప్పు, బెల్లాలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు. గురువారం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్ లోనైనా వృథా ఖర్చులను తగ్గించి నగరాభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రతిపక్షాలు, స్థానికులు కోరుతున్నారు. – వరంగల్ వాయిస్ ప్రతినిధి

- తుప్పు పడుతున్న ఎఫ్ టీసీ మిషన్
- రూ.40 లక్షల ప్రజా ధనం వృథా
- కొత్త వింత.. పాత రోతగా వ్యవహరిస్తున్న బల్దియా
- పర్సంటేజీల కోసమే అంటూ ప్రతిపక్షాలు విమర్శలు








2లో..

## వెటరన్ బ్యాడ్మింటన్ పోటీల్లో మనోళ్లు

జేఎన్ఎస్ నుంచి తరలి వెళ్లిన 18 మంది క్రీడాకారులు

## పోలీస్ స్టేషన్ లో దొంగలు పడ్డారు

- బెల్లం బస్తాలు దొంగిలించిన దుండగులు
- రెడ్ హ్యాండెడ్ గా పట్టకొని కేసు నమోదు చేసిన పోలీసులు




2లో..

## గడీలు దాటి బయటికి రా..




8లో..

- ఎంజీఎంపై దృష్టి సారించు
- మంత్రి సురేఖకు బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ విజ్ఞప్తి
- ఆత్మగౌరవ పోరాటం పేరుతో మహాధర్నా

# జీవన గమనాన్ని మార్చుతున్న ఒలంపియాడ్

- రవీంద్ర భారతిలో అవార్డు తీసుకోవడం గొప్ప విషయం
- ఉమ్మడి రాష్ట్రాల ఐటీ కమిషనర్ జీవన్ లాల్
- జర్నలిస్ట్ పులికంటి రాజేందర్ కు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ఇప్పటి వరకు రవీంద్రభారతిలో అవార్డు తీసుకున్న వాళ్లు భారతదేశం గర్వించే స్థాయిలో ఉన్నారని, ఎస్ఆర్ఎఫ్ ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ చాటి ఇక్కడికి వచ్చిన మీరు కూడా సర్వోన్నతమైన స్థాయిలో నిలుస్తారని ఉమ్మడి రాష్ట్రాల ఐటీ కమిషనర్ జీవన్ లాల్ ఆకాంక్షించారు. ఎస్ఆర్ఎఫ్ నిర్వహించిన పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులను పంపిణీ చేశారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన ఎస్ఆర్ఎఫ్ ఎక్సలెంట్ అవార్డ్స్–2025 పంపిణీ కార్యక్రమానికి జీవన్ లాల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ జీవితంలో ఒక్కసారైనా రవీంద్ర భారతి స్టేజీపైన అవార్డు తీసుకోవాలని చాలా మందికి ఉంటుందన్నారు. ఇక్కడ అవార్డు తీసుకోవడం మామూలు విషయం కాదన్నారు. ఈ అవకాశం కల్పించిన ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తుమ్మ అమరేష్ ను మనం గొప్పగా ప్రశంసించాలన్నారు. ఈ అవకాశం అందరికీ రాదన్నారు. మీ గెలుపులోనే మీ తల్లిదండ్రులు సంతోషాన్ని వెతుక్కుంటారన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెద్ద పెద్ద కంపెనీలను నడిపించేది మన భారతీయులేనని, నాసాలోనూ మనోళ్లే ఉన్నారని గుర్తు చేశారు. మీలాంటి పిల్లలే భవిష్యత్తులో ప్రపంచాన్ని ఏలుతారన్నారు. స్వార్ధంగా పనిచేసే ఈ రోజుల్లో నిస్వార్ధంగా విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు గత 22 సంవత్సరాలుగా ఎస్ఆర్ఎఫ్ చేస్తున్న కృషి అమోఘమని కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐటీ కమిషనర్ జీవన్ లాల్ తో పాటు అవార్డుల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులను ఘనంగా సన్మానించారు. గత 20 సంవత్సరాలుగా పత్రికా, మీడియా రంగలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా జర్నలిస్ట్ పులికంటి రాజేందర్ ను ఘనంగా సన్మానించి, మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్ రావు, పోపా రాష్ట్ర అధ్యక్షులు శామంతుల శ్రీనివాస్, కేయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చిర్రా రాజు గౌడ్, డబ్ల్యూఈఓ జాతీయ అధ్యక్షులు సీహెచ్.భద్ర, ఎస్ఆర్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు తుమ్మ అమరేష్, స్వరాజ్ న్యూస్ సీఈఓ, ఎస్ఆర్ఎఫ్ అడ్వైజర్ పులికంటి రాజేందర్, ఎస్ఆర్ఎఫ్ బృందం తోట రాజు శశి, దిలీప్, బాలు, రమేష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.



# వెటరన్ బ్యాడ్మింటన్ పోటీల్లో మనోళ్లు

- జేఎన్ఎస్ నుంచి తరలి వెళ్లిన 18 మంది క్రీడాకారులు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గోవాలో ఐదు రోజులపాటు నిర్వహించనున్న నలభై ఏడో భారత మాస్టర్స్ (వెటరన్) నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు హనుమకొండ జేఎన్ఐఎస్ నుంచి 18 మంది క్రీడాకారులు తరలి వెళ్లారు. టీబీఏ అధ్యక్షులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నాయకత్వంలో బుధవారం షటిల్ క్రీడాకారులు ఉత్సాహంగా హనుమకొండ నుంచి గోవాకు బయలుదేరారు. జాతీయ క్రీడాకారులు గడ్డం కేశవమూర్తి, కొత్తగట్టు సుధాకర్, కొలుగూరి ప్రభాకర్ రావు, పీచు రాజిరెడ్డి, కోట రమణారెడ్డి, పూజారి విజయకుమార్, పొరిక విజయ్ కుమార్, కోమాకుల మధుకర్, పడాల రాజు ప్రసాద్, ఎండ్ల భిక్షపతి, సుద్దాల సంపత్ తదితరులు గోవా వెళ్లిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా షటిల్ కోచ్ లు కూరపాటి రమేష్, మాడిశెట్టి శ్రీధర్, వైవి రాజేందర్, చల్ల రాజు, సురభి కిరణ్, అరుణ్, విక్రం రెడ్డి, శ్రీధర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, కట్ల శ్రీనివాస్ క్రీడాకారులందరినీ అభినందించారు. గోవాలో తమ ప్రతిభను ప్రదర్శించి బహుమతులతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులందరికీ వరంగల్ వాయిస్ పక్షాణ ఆల్ ద బెస్ట్.



# అవార్డు గ్రహీత శ్రీనివాస్ కు ఘన సన్మానం

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నగరంలోని శంభునిపేట పవర్ సబ్ స్టేషన్ లో సీనియర్ లైన్ ఇన్ స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న గుండా శ్రీనివాస్ ను బుధవారం సబ్ స్టేషన్ లో ఘనంగా సన్మానించారు. శ్రీనివాస్ కు ఇటీవల కార్మిక శ్రమశక్తి అవార్డు లభించింది. ఈ సందర్భంగా సబ్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏడీ చంద్రమౌళి, ఏఈ రవికుమార్ హాజరై శ్రీనివాస్ కు బొకే అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన ధర్మాన్ని గుర్తెరిగి ప్రజలకు సేవలు అందిస్తే ఇలాంటి అవార్డులు వాటంతట అవే అభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ సురేష్, శ్రీకాంత్ లైన్ మెన్ రఘు, బొమ్మెర రాజు, అసిస్టెంట్ లైన్ మెన్ ప్రవీణ్, రాజశేఖర్, జూనియర్ లైన్ మెన్ శ్రీనివాస్, సిబ్బంది సందీప్, వెంకటయ్య, నరేష్, చిన్న, రాజేందర్ తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

# పదో తరగతి పరీక్షలు పక్కడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈనెల 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు పదో తరగతి వార్షిక పరీక్షలను అధికారులు సమన్వయంతో పక్కడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో సంబంధిత శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై ఆమె సమీక్షించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిర్వహించనున్న ఈ పరీక్షలకు జిల్లాలో 49 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు గాను 49 పంది ముఖ్య పర్యవేక్షకులు 49 మంది శాఖ అధికారులు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లు, నలుగురు కస్టోడియన్లు 461 మంది ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలన్నారు. వేసవి దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, నిరంతర విద్యుత్ కల్పించడంతోపాటు ఏఎన్ఎం, ఫస్ట్ ఎయిడ్, ఓఆర్ఎస్ తో అందుబాటులో ఉండాలని, ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన రూట్లలో ప్రశ్న, జవాబు పత్రాలు తరలింపు సమయంలో పోలీస్ అధికారులు తప్పనిసరిగా ఉండాలన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చూడాలని ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి భయభ్రాంతులకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, డీఈఓ జ్ఞానేశ్వర్, జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ కె.అరుణ, డీఎంహెచ్ఓ, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలు..

పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ –2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో ఉంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాలకు ఐదు వందల మీటర్ల దూరం వరకు ఇద్దరికి మించి గుంపులుగా ఉండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

# పోలీస్ స్టేషన్ లో దొంగలు పడ్డారు

- బెల్లం బస్తాలు దొంగిలించిన దుండగులు
- రెడ్ హ్యాండెడ్ గా పట్టకొని కేసు నమోదు చేసిన పోలీసులు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** నివాస గృహాలు, దుకాణాలు, దేవాలయాలు, బ్యాంకుల్లో దొంగతనం చేయడం సర్వసాధారణం అనుకున్నారేమో.. దీనికి భిన్నంగా తమ చోరీ కళను ప్రదర్శించాలని భావించారు కాబోలు..ఏకంగా పోలీస్ స్టేషన్ లోనే దొంగతనానికి పాల్పడి ఔరా అనిపించిన ఘటన డోర్నకల్ లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలిస్తే ఎవరైనా అశ్చర్యం, విస్మయానికి గురికాక తప్పదు. డోర్నకల్ పోలీస్ డైరీ క్రైం డిటెల్స్ పరిశీలిస్తే.. ఇద్దరు యువకులు ఈ నెల 4వ తేదీ అర్ధరాత్రి వేళ పోలీస్ స్టేషన్ ఆవరణలోకి చొరబడి బెల్లం ఎత్తుకెళ్తుండగా గమనించిన పోలీసులు వెంబడించి పట్టుకొని కేసు నమోదు చేసినట్లు సమాచారం. వీటి వివరాలు ఇలా ఉన్నాయి.. డోర్నకల్ పట్టణంలోని బాపూజీ నగర్ కు చెందిన తాల్లపల్లి అఖిల్, జనగామ ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి బంధువులు. వీరు పోలీస్ స్టేషన్ సమీపంలోని రాజు తండాలో మద్యం సేవించారు. అనంతరం తిరుగు ప్రయాణంలో పోలీస్ స్టేషన్ లో ఇతరులనుంచి పట్టుకున్న బెల్లం బస్తాలపై వీరి కన్ను పడింది. దీంతో ఎలాగైనా బెల్లం దొంగిలించాలన్న నెపంతో పోలీస్ స్టేషన్ పక్కనే తమ ఆటోను నిలిపారు. ఇద్దరు గోడ దూకి పోలీస్ స్టేషన్ ఆవరణలోకి ప్రవేశించారు. పోలీస్ స్టేషన్ లోపలికి వెళ్లి 50 కేజీల బెల్లం బస్తాలను దొంగిలించి ఆటోలో ఎక్కించారు. ఇదే సమయంలో బీట్ డ్యూటీలో ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లు దూరంగా ఆగి ఉన్న ఆటో.. అందులో వ్యక్తులు ఉన్నట్లు గమనించి సోదా చేయగా దొంగిలించిన బెల్లం బస్తాలు లభించాయి. విచారించిన పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి నిందితులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టి రిమాండ్ కు తరలించారు.

# బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యం

## కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, పరకాల :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలలో బీసీ కులగణన, ఎస్సీ కుల వర్గీకరణ బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టి వాటిని ఆమోదించిన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి బుధవారం పరకాల పట్టణంలోని బస్టాండ్ కూడలిలో పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు. పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు కటుక్కూరి దేవేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ఆధ్యర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనాడు ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ గారు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే బీసీ కులగణన కార్యక్రమాన్ని చేసి బిల్లును అసెంబ్లీలో ఆమోదించడానికి, అలాగే సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును గౌరవించి దేశం లోని మొట్టమొదటిసారిగా ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి బిల్లును ఆమోదించడానికి కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు పరకాల కాంగ్రెస్ పార్టీ తరుపున ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు వారికి స్వయం ఉపాధి కల్పన కోసం రాజీ యువ వికాసం పేరుతో వారికి ఉపాధి అవకాశాలు బ్యాంక్ ల ద్వారా హామీ లేని రుణాలు ఇప్పిస్తూ 80 శాతం సబ్సిడీ ఇచ్చి వారికి ఉపాధి కల్పిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పరకాల సమన్వయ కమిటీ సభ్యులు సోద రామకృష్ణ, కుంకుమేశ్వర్ టెంపుల్ చైర్మన్ కొలుగురి రాజేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు పంచగిరి జయమ్మ, మడికొండ సంపత్ కుమార్, మాజీ ఎంపీపీ రామ్మూర్తి, చిన్నల గోనాథ్, నల్లబోల కృష్ణయ్య, అల్లం రఘునారాయణ, దాసరి భిక్షపతి, మడికొండ సంపత్, బండి సదానందం గౌడ్, పసుల రమేష్, మార్క రఘుపతి గౌడ్, నల్లెల అనిల్, బొమ్మ కంటి చంద్రమౌళి, దుబాసి వెంకటస్వామి, అంబిరు మహేందర్, సుంకరి దిలీప్, ఎండీ తాజుద్దీన్, ఎండీ ఆజి, బొచ్చు జెమిని, మచ్చ సుమన్, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. తమకు నెలకు ₹18,000 ఫిక్స్డ్ వేతనం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా, కలెక్టర్ కార్యాలయంలో ERC బహిరంగ విచారణ జరుగుతుండగా, ఆశా వర్కర్లు గేట్లను దాటి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, సుబేదారి పోలీసులు వారిని అడ్డుకున్నారు. అధికారులు వినతిపత్రం స్వీకరిస్తారని నచ్చజెప్పిన పోలీసులు, జిల్లా వైద్య అధికారి డాక్టర్ అప్పయ్యను ధర్నా ప్రాంతానికి రప్పించారు. ఆయన ఆశా వర్కర్ల వినతిపత్రాన్ని స్వీకరించి, జిల్లా పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, అలాగే వేతనాల పెంపును రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తామని హామీ ఇచ్చారు. సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి మాట్లాడుతూ, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రూ.18,000 ఫిక్స్డ్ వేతనం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి ఈ వేతనం అమలు చేస్తామని హామీ ఇచ్చినా, 15 నెలలు గడిచినా ఆ నిర్ణయం అమలు కాలేదని వారు విమర్శించారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 21న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ధర్నాలు, మార్చి 24న "చలో అసెంబ్లీ" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బొట్ల చక్రపాణి, సీహెచ్ రాజేశ్వరి, శ్రీవాణి, కే.కల్పన, గొర్రె పుతిలి, ఈ.శోభ, రమ, సంధ్య, యాకూబీ, శోభ, పద్మ, జ్యోతి, సూర్య, కళ, రజిత, లీల తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బీసీ బిల్లు ఆమోదం చారిత్రాత్మకం

## వీఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎగోజు రవీంద్ర చారి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ శాసన సభ శాసన మండలిలో బీసీ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా బుధవారం విశ్వ బ్రహ్మణ రిజర్వేషన్ పోరాట సమితి (వీఆర్పీఎస్) జిల్లా అధ్యక్షుడు ఎగోజు రవీంద్ర చారి మాట్లాడుతూ బీసీలకు విద్య ఉద్యోగాల్లో స్థానిక సంస్థ ఎన్నికలలో బీసీ రాజకీయ రిజర్వేషన్లను 42 శాతం పెంచుతూ తెలంగాణ శాసన సభ శాసన మండలిలో ఆమోదం పొందడం చారిత్రాత్మకమంటూ హర్షం వ్యక్తం చేశారు. బీసీ బిల్లు ఆమోదం కొరకు ప్రత్యేకంగా చొరవ చూపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు ఇదే సమయంలో బీసీ బిల్లు ఆమోదానికి బేషరతు మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీ నేతలకు, బీసీ కుల సంఘాల తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. బీసీ బిల్లు తదుపరి అమలు కోసం ఢిల్లీ కేంద్రంగా జరిగే పోరాటంపై అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, అసెంబ్లీ సమావేశాల్లో విద్యాశాఖ గురించి చర్చ జరగాలని హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంత కార్య సమితి సభ్యులు ఆరెపల్లి సుజిత్ పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా విద్యార్థి వ్యతిరేక విధానాలతో ముందుకు పోతుందన్నారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బోధన సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలని, అదేవిధంగా విశ్వవిద్యాలయాల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా సోయి తెచ్చుకొని స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ హాస్టల్లో విద్యార్థులు చనిపోతుంటే పట్టించుకోకుండా ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తన సీటును కాపాడుకోవడం కోసం ఢిల్లీ పర్యటన చేస్తున్నాడు తప్ప రాష్ట్రాన్ని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర బడ్జెట్ లో విద్యా శాఖకు 15 శాతం నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటని, విద్యాశాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్న ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వాని విద్యార్థులు బుద్ధి చెప్పాలన్నారు. వెంటనే ఫీజు రీయింబర్ మెంట్స్, స్కాలర్ షిప్ విడుదల చేయకపోతే మీ ప్రజా భవాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహానగర్ కార్యదర్శి తాళ్లపల్లి అరుణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రవణ్, భరత్, శ్రీజ, జోనల్ ఇంచార్జిలు హరిచరణ్, శ్రీకాంత్, రోహిత్, సర్దార్, రాహుల్, మౌనిక, త్రినీక్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులకు విద్యార్థుల పాదపూజ

## ఆర్డీఎఫ్‌లో సాంప్రదాయ సంబరాలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ఆర్డీఎఫ్ రోళ్లకల్ పాఠశాలలో 10వ తరగతి పరీక్షల హాల్‌టికెట్ పంపిణీ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. పరీక్షలకు ముందు విద్యార్థులను ఆశీర్వదించడం అభినందించడం ఈ కార్యక్రమం లక్ష్యం. అనంతరం విద్యార్థులకు కూస రాజు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందించగా, కొండపెల్లి శ్రీనివాస్ విద్యార్థులందరికీ చేతి గడియారాలు అందజేశారు. అభ్యాసం, సమాజ ప్రమేయాన్ని ప్రోత్సహించడానికి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను వివిధ ఈవెంట్‌లు, కార్యకలాపాలలో చురుకుగా నిమగ్నం చేస్తుంటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాషబోయిన రాములు, అసిస్టెంట్ హెచ్‌ఎం ఈ.రమేష్, ప్రాథమిక ఇంచార్జి జె.బాలరాజు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బీసీలను నిరాశపరిచిన రాష్ట్ర బడ్జెట్

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్:** రాష్ట్ర శాసనసభలో ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ బీసీలను తీవ్రంగా నిరాశపరిచిందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. రూ. 3,04,965 కోట్ల బడ్జెట్లో 56%కి పైగా జనాభా ఉన్న బీసీల సంక్షేమానికి కేవలం రూ. 11,405 కోట్లు మాత్రమే కేటాయించడాన్ని ఆయన అన్యాయంగా అభివర్ణించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్యా, ఉద్యోగ రంగాల్లో 42% రిజర్వేషన్ బిల్లులను శాసనసభలో ఆమోదించడంతో ప్రభుత్వం బీసీల విశ్వాసాన్ని చూరగొన్నప్పటికీ, బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టమైనా, బీసీ సంక్షేమాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని వెంకట్రాములు పేర్కొన్నారు. ముఖ్యంగా చేతివృత్తిదారులైన చేనేత కార్మికులు, గీత కార్మికులు, మత్స్యకారులు, రజకులు, క్షౌరికులు, గొర్రెల పెంపకదారులు, వడ్రంగి, కమ్మరి, కుమ్మరి వర్గాల అభివృద్ధికి బడ్జెట్‌లో తగిన నిధులను కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఎంపీడీఓ సమీక్ష సమావేశం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న కీలక సమస్యలపై ఎంపీడీవో మాలోత్ శంకర్ నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనులు, నర్సరీల అభివృద్ధిపై దృష్టి సారించారు. రానున్న వేసవి కాలంలో తాగునీటి ఎద్దడిని నివారించాలని గ్రామాల్లోని అన్ని బోర్లు మరమ్మతులు చేయాలని, మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలుంటే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని సూచించారు. పని ప్రదేశాల్లో నీడ, తాగునీరు, మెడికల్ కిట్‌లు వంటి కనీస సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. జూన్ వరకు అన్ని గ్రామాల నర్సరీలలో మొక్కలు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఒక వారంలోగా వంద శాతం పన్ను వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామంలోని శ్మశాన వాటికల్లో నీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఎస్‌బీఎం మరుగుదొడ్లను నెలాఖరులోగా నిర్మించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**31 లోగా ఫీజు చెల్లిస్తే 25శాతం రాయితీ**

**జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**




**వరంగల్ వాయిస్, ములుగు :** అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణకు, ప్లాట్ల రెగ్యులరైజేషన్ కు 2020 సంవత్సరంలో ఎల్.ఆర్.ఎస్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు ప్రస్తుతం ఫీజు చెల్లించుటకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీ అవకాశాన్ని జిల్లాలోని అర్హులైన వారందరూ గడువులోగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకుందని, ఎఫ్.టి.ఎల్, నిషేధించిన సర్వే నెంబర్లు మినహా ఎల్.ఆర్.ఎస్ 2020కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించామని తెలిపారు. రుసుము ఎంత అనేది ఎవరైనా తమ సెల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి పరిశీలించవచ్చని అన్నారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులు ఎవరైనా ఈనెల 31వ తేదీ లోగా చెల్లిస్తే 25 శాతం మినహాయింపు ఉంటుందని తెలిపారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతించడం ఉండదని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా క్రమబద్ధీకరణ చేసుకోవాలని, ఈ నెల 31వ తేదీ వరకు ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకొని 25% రాయితీ పొందాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# భూపాలపల్లి రహదారి కోసం అటవీ శాఖకు నగదు చెల్లింపు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రమైన భూపాలపల్లి నుండి పెద్దపల్లి జిల్లా ఖమ్మం పల్లి వరకు 33.70 కోట్ల వ్యయంతో వయ తాడి చెర్ల మీదుగా నిర్మిస్తున్న డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా అటవీ శాఖ అనుమతి కోసం టోకెన్ అమౌంట్ నాలుగు కోట్ల 67 లక్షల 75,250 రూపాయల మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించింది. దీంతో భూపాలపల్లి రహదారికి అది పెద్ద అడ్డంకిగా మారిన అటవీ అనుమతుల సమస్య తీరినట్లయ్యింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మాజీ ఎంపీపీ చింతలపల్లి మలహర్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కేసారపు చంద్రయ్య, సొసైటీ డైరెక్టర్ ఒన్న తిరుపతిరావు, మాజీ ఎంపిటిసి సభ్యుడు తిరిగి సమ్మయ్య గౌడ్, నాయకులు బొబ్బిలి రాజు, పేరాల వెంకటేశ్వరరావు ఇందారపు చంద్రయ్య, పేరాల మురళీధర్ రావు ఇందారపు ప్రభాకర్, ఇందారపు రాజసమయ్య, పుప్పాల రాజు, కటకం మధుసూదన్, రావుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక లారీలతో వాహన దారులకు ఇబ్బందులు



**వరంగల్ వాయిస్, మల్హర్ :** భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం మల్లారం ఇసుక క్వారీ వద్ద వందల సంఖ్యలో ఇసుక లారీలు బారులు తీరడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్వారీలో ఇసుక లోడింగ్ లో జాప్యం జరుగుతుండటంతో మల్లారం పెద్ద గుట్ట నుంచి మల్లారం క్వారీ వరకు వందల సంఖ్యలో లారీలు నిలిచిపోతున్నాయి. దీంతో మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వెళ్లే వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు దుమ్ము, ధూళితో అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని, పంటలు కూడా నాశనం అవుతున్నాయని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పోరాట ఫలితంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం

**● బీసీ సంక్షేమ సంఘం నేత బైరి రవికృష్ణ గౌడ్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, స్థానిక ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనన్న నేతృత్వంలో బీసీల హక్కుల కోసం దేశవ్యాప్తంగా పోరాటం జరుగుతుండగా, కాంగ్రెస్ పార్టీ బీసీలకు న్యాయం చేయాలని ముందుకొచ్చింది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా తెలంగాణకు వచ్చినప్పుడు కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వస్తే కులగణన చేపట్టి బీసీలకు చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే కులగణన నిర్వహించి విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42% రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి, ఆ మాటను నిలబెట్టుకున్నారు. శాసనసభలో బీసీ రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదం పొందేలా చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ నేతృత్వంలో హనుమకొండ అంబేద్కర్ జంక్షన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ మాట్లాడుతూ, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు లేని కారణంగా బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి పోతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, కులగణన చేపట్టి పార్లమెంటులో బీసీ బిల్లు ఆమోదం పొందేలా చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాడి మల్ల యాదవ్, బచ్చు ఆనందం, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనగాని యాదగిరి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు కాసాగోని అశోక్, మారగోని రవి, అరేగంటే నాగరాజు, తమ్మేలా శోభరాణి, సులోచన, ప్రమోద్, పంజలా మధు గౌడ్, మేర్గు శంకర్, సుమన్ రాజు, నగేష్, అజయ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ఎర్రగట్టు వెంకన్న హుండీల లెక్కింపు



**■ గత ఏడాది కన్నా పెరిగిన ఆదాయం**

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** గ్రేటర్ వరంగల్ 1వ డివిజన్ లోని ఎర్రగట్టు శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి మంగళవారం వరకు ఐదు రోజులు వైభవంగా జరిగాయి. బుధవారం ఆలయ ఈవో వెంకట్రావు, ఆలయ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి సేవా సమితి మహిళా సభ్యులచే ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి హుండీలు లెక్కించారు. మొత్తం ఆదాయం రూ.16, 33,296 గత సంవత్సరం కంటే రూ.3,49,583 అధిక ఆదాయం వచ్చిందని ఈవో వెంకటరావు తెలిపారు. వాటి వివరాలు వేలం పాటల ద్వారా రూ.6, 22,500, స్వామివారి కల్యాణం కట్నాలు రూ.11,160, శ్రీ ఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం రూ. 1,92,450, అర్చన అష్టోత్తర పూజలకు రూ. 60,700, విరాళాలు రూ.12,364, స్వామి వారి కట్నాలు రూ.6,859, కేశఖండన రూ.40, గండ దీపం రూ.36,232, హుండీ ఆదాయం రూ. 5,88,225, త్రై బజార్ రూ. 33,966, మొత్తం రూ.16,33,296 ఈ సంవత్సరం ఆదాయం వచ్చిందని, గత సంవత్సర ఆదాయం కంటే రూ. 3,49,583 రూపాయలు ఆదాయం ఎక్కువ వచ్చిందని ఆలయ ఈవో వెంకటరావు ఆలయ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి తెలిపారు. శ్రీఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు సహకరించిన పోలీస్ సిబ్బందికి, కార్పొరేషన్ సిబ్బంది, ఎలక్ట్రిసిటీ, హెల్త్ డిపార్ట్మెంట్ వారికి ఈవో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సబ్ ఆర్డినేటర్ శ్రీనివాస్, చంద్రయ్య, కమిటీ సభ్యులు శీలం రమేష్, కనపర్తి రాజు, పోలరాజు, శ్యామల, చింతల రమేష్, మిగుళ్ల సురేష్, మానుపాటి విజేందర్, చాగంటి సదానందం, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ, బీసీల రిజర్వేషన్ల ఘనత సీఎం రేవంత్ రెడ్డిదే



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నర్సయ్య గౌడ్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఎస్సీ వర్గీకరణ బిల్లును, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అసెంబ్లీలో ఆమోదించిన శుభ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే దొంతిమాధవరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం బాణా సాంచా కాల్చి, అరటి పండ్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోగిలి వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, మాజీ ఎంపీపీ కేతిడి వీరా రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నన్నెబొయిన రమేష్, యాదవ్ మండల ప్రధాన కార్యదర్శి మంచాల సదయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దేన రమేష్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాధు మధు సూదన్ రెడ్డి, మండల అధ్యక్షుడు సంపత్ రెడ్డి, మాజీ సర్పంచ్ తూటి పావని రమేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీష్, మాజీ ఎంపీటీసీ ఆవుల రాములు, మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు అమీరొద్దీన్, నాయకులు చీర అశోక్, జోరు వీరయ్య గౌడ్, మల్లా రెడ్డి, మెంతుల రమేష్, నారాయణ రెడ్డి, ఈశ్వర్, భద్రయ్య, పెద్దమ్మల రాజేందర్, కట్టస్వామి, రాంచందర్ నర్సింహ రావులు, హంస భద్రయ్య, పెండ్లి రాజేందర్, మారెల్లి కుమారస్వామి, ఆకుల అశోక్, ఆయా గ్రామాల అధ్యక్షులు తిరుపతి రెడ్డి, బాలు నాయక్, ప్రభాకర్, గోవింద్ నాయక్, రాజ శేఖర్, కుమారస్వామి, హనుమ నాయక్, నర్సయ్య, ఈర్యా నాయక్ రమేష్, శంకర్ మహేందర్, రవి నాయక్, మైనారిటీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ కయాజ్, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, యువజన కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు లక్క రాజు, రాకేష్ పాల్గొన్నారు.

## నడికూడలో..

**వరంగల్ వాయిస్, నడికూడ :** బుధవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో



క్షీరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి డా.మహల్ రావు, నడికూడ మండల సమన్వయ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల అధ్యక్షులు, మహిళా కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దామెరలో..



**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆదేశాల మేరకు పరకాల యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ సూచనల మేరకు దామెర మండల్ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పోన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. దామెర మండల అధ్యక్షులు నల్ల సుధాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

బుధవారం, మార్చి 19, 2025

# ఆఖరి మజిలీ ఆగం ఆగం..

- అధ్వాన్నంగా వైకుంఠ ధామం
- చీకట్లోనే దహన సంస్కారాలు

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పర్వతగిరి వైకుంఠ ధామం పరిస్థితి అధ్వాన్నంగా ఉంది, అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి డ్యామ్‌లు నిర్మించినా పారిశుధ్యం, మంచినీరు, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. దీంతో గ్రామస్తుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ఇప్పటికైనా నిర్లక్ష్యం వహించిన అధికారులను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల పర్వతగిరి మండల పంచాయతీ అధికారి పాకా శ్రీనివాస్ ఈ ప్రాంతాన్ని సందర్శించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.





### సెల్ ఫోన్ లైట్ల సాయంతో దహన సంస్కారాలు..

ఈ ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం లేకపోవడం వల్ల ప్రజలు దహన సంస్కారాలకు సెల్ ఫోన్ లైట్లను ఉపయోగించాల్సి వస్తోంది. ప్రమాదాల విషయంలో భద్రత, జవాబుదారీతనం గురించి ఆందోళనలు చెలరేగాయి. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహా ప్రముఖ రాజకీయ నాయకుల బంధువులు ఈ పరిస్థితిపై ఆశ్చర్యం, ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ.. తమ సొంత గ్రామంలో ఇంత నిర్లక్ష్యం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు.

## గ్రీన్ ఫీల్డ్ హైవే బాధిత రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం అందించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ వరకు, తెలంగాణ రాష్ట్రం మీదుగా నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణం కారణంగా రైతులు తమ భూములను కోల్పోతున్నారని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 1956 భూసేకరణ చట్టాన్ని అనుసరించి భూములను స్వాధీనం చేసుకోవడంతో రైతులు భారీ నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. అయితే, ఇటీవల మామునూరు విమానాశ్రయ పునర్నిర్మాణం కోసం బాధిత రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూమి సేకరిస్తామని వరంగల్ ఆర్డీవో నోటీసులు జారీచేసిందని పేర్కొన్నారు. అయితే, అదే విధంగా గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో కూడా 2013 చట్టాన్ని అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఎందుకు వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. పార్లమెంటులో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, భూములను బహిరంగ మార్కెట్ ద్వారా కొనుగోలు చేయాలని సూచించినప్పటికీ, దాని అమలుకు బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని రాచర్ల బాలరాజు పేర్కొన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు నష్టపరిహారం, పునరావాసం, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బహుళ జాతి కంపెనీలు, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను కాపాడుతూ రైతుల జీవితాలను అంధకారంలోకి నెడుతోందని తీవ్ర విమర్శలు చేశారు. గత ప్రభుత్వ విధానాలను పక్కన పెట్టి, 2013 భూ సేకరణ చట్టాన్ని అనుసరించి రైతులకు న్యాయం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

## డివిజన్ ను అన్ని విధాల అభివృద్ధి చేస్తా

### కార్పొరేటర్ పల్లం పద్మరవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం 32వ డివిజన్ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావు సహకారంతో స్థానిక కార్పొరేటర్ పల్లం పద్మ రవి చేతుల మీదుగా ఎస్ఆర్ఆర్ తోట బొడ్రాయి సమీపంలో కమ్యూనిటీ హాల్ (గ్రంథాలయ) భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అదే విధంగా భవన నిర్మాణానికి ముగ్గు పోయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ ను అన్ని విధాల అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. విద్యార్థులకు, విద్యావంతులకు, నిరుద్యోగులకు అందరికీ అందుబాటులో ఉండే విధంగా గ్రంథాలయాన్ని త్వరగా నిర్మించి అందరికీ అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తో మునిసిపల్ అధికారులు ఏఈ ముజామిల్, గ్రంథాలయ కమిటీ సభ్యులు, మాజీ కార్పొరేటర్ కత్తెరసాల వేణుగోపాల్, డివిజన్ అధ్యక్షులు సందీప్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, డివిజన్ పెద్దలు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారు

- ఎంసీపీఐయూ నేత గడ్డం నాగార్జున

**వరంగల్ వాయిస్, వరంగల్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పును వెల్లడిస్తారని ఎంసీపీఐయూ నేత గడ్డం నాగార్జున పేర్కొన్నారు. రాష్ట్ర శాసనసభలో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మూడు లక్షల నాలుగు వేల తొమ్మిది వందల అరవై ఐదు కోట్ల రూపాయల బడ్జెట్‌ను ఆర్భాటంగా ప్రవేశపెట్టిన తీరు ప్రజలకు మోసం చేసేలా ఉందని ఎంసీపీఐ(యు) హనుమకొండ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం నాగార్జున విమర్శించారు. ఈ బడ్జెట్ గత బీఆర్ఎస్ పాలనలో చూసిన అంకెల గారడీ బడ్జెట్‌కు భిన్నం కాదని, పాత సీసాలో కొత్త సారాయిలా ఉందని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వివిధ వర్గాల అభివృద్ధికి కేటాయించిన నిధులు తక్కువగా ఉండటం ఆందోళన కలిగించేదని ఆయన చెప్పారు. మహిళలు, శిశు సంక్షేమానికి కేవలం రూ. 2,862 కోట్లు కేటాయించగా, రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీల అభివృద్ధికి రూ. 11,405 కోట్లు కేటాయించడం సరిపోదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన 42 శాతం బీసీ రిజర్వేషన్‌కు ఈ నిధులు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు.



అలాగే, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కోసం రూ. 57,401 కోట్లు కేటాయించినప్పటికీ, వాటి వినియోగంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. యువజన రంగానికి సరైన కేటాయింపులు లేకపోవడం, పారిశ్రామిక రంగానికి కేవలం రూ. 3,527 కోట్లు ఇవ్వడం, క్రీడా రంగానికి రూ. 465 కోట్లు మాత్రమే కేటాయించడం రాష్ట్ర అభివృద్ధికి అడ్డుగోడగా మారుతుందని పేర్కొన్నారు. ఆరోగ్య రంగానికి కేటాయించిన రూ. 12,393 కోట్లతో ప్రభుత్వ వైద్యం అభివృద్ధి సాధ్యమా? ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల పరిష్కారం ఎప్పుడు? మండల స్థాయిలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, గురుకులాల అభివృద్ధి ఈ తక్కువ నిధులతో ఎలా సాధ్యం? గ్రామీణ పాఠశాలల అభివృద్ధి కోసం సరైన ప్రణాళిక లేకుండా విద్యా రంగానికి రూ. 23,108 కోట్ల కేటాయింపు సరిపోదని వ్యాఖ్యానించారు. "ఈ తప్పుడు బడ్జెట్ ప్రవేశపెట్టిన పాలక కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన మూల్యం చెల్లిస్తారు" అని గడ్డం నాగార్జున హెచ్చరించారు.

## మోడల్ స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్ ను బుధవారం భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సందర్శించారు. మోడల్ స్కూల్ లో తరగతి గదులను పరిశీలించి విద్యార్థులకు భోజన వసతి, తాగు నీటి సరఫరాపై ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యామ్ సుందర్, తహసీల్దార్ రవి కుమార్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణ చందర్ రావు, ఎడ్లపల్లి కార్యదర్శి భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరీక్షల వేళ జాగ్రత్తలు అవసరం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల 9 వేల మందికి పైగా విద్యార్థులు 2650 ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలలో పరీక్షలు రాయబోతున్నారు. ఉదయం 9 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు జరగబోయే పరీక్షలకు విద్యార్థులు సమాయత్తమవుతున్న సంగతి తెలిసినదేనని, పరీక్షలు రాసే విద్యార్థులు సాత్విక ఆహారాన్ని పండ్లను ఎక్కువగా తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. దారిలో ఎవరైనా విద్యార్థులు లిఫ్ట్ అడిగితే తప్పకుండా ఇవ్వాలని వీలైతే సెంటర్ వరకు దింపండని సూచించారు.

## ఘనంగా స్వయంపాలన దినోత్సవం



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు గా మారి తరగతి గదులలో విద్యాబోధన చేశారు. అనంతరం ఉపాధ్యాయులుగా ఉన్న విద్యార్థులు సమావేశంలో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అనేది సమాజంలో విలువలతో కూడుకొని ఉన్నదని, ఉన్నతమైనదని అన్నారు. గురువు లేని విద్య గుడ్డి విద్య అని, సమాజంలో ఒక డాక్టర్, లాయరు, పోలీస్, కలెక్టర్, రాజకీయ నాయకులు, తయారు కావాలంటే గురువు మార్గదర్శనంలోనే సాధ్యమన్నారు. ఒకరోజు ఉపాధ్యాయులుగా పని చేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్వయం పరిపాలన దినోత్సవం లో ప్రధానోపాధ్యాయులుగా ముష్కే గగన్ వాల్మీకి, ఉపాధ్యాయులుగా సురుగుల నవ్య శ్రీ, శనిగరం చరణ్, కట్ల హిమాన్షు రెడ్డి, మామిడాల విశ్వతేజ రెడ్డి, దుబ్బాకుల వశిష్ట భార్గవ, తోకల నవనీత్ రెడ్డి, గోగుల జస్వంత్ రెడ్డి, కందికట్ల హర్షిత్,సోలంకి జస్మిత, గరిడే శ్రీనిత, తాళ్లపల్లి శ్రీనిధి,పూసాల అభిజ్ఞ,తాళ్లపల్లి శరణ్య, వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్, ఉపాధ్యాయులు లకావత్ దేవా, మేకల సత్యపాల్ రెడ్డి, అంగన్వాడీ టీచర్స్ భీముడి లక్ష్మి, నందిపాటి సంధ్య ఐఆర్పీ రమేష్ పాల్గొన్నారు.

## ఆలయానికి బియ్యం అందజేత



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన పట్టాభి సీతా రామచంద్ర స్వామి దేవాలయంలో ఏప్రిల్ 6న ఆదివారం జరగబోయే సీతారాముల కళ్యాణ మహోత్సవానికి మండల కేంద్రంలోని వెలుతుల్లపల్లి గ్రామానికి చెందిన దుగ్యాల నర్సింగరావు, కాలువ ఆనందం, గణపురానికి చెందిన వెంకటేశ్వర రాజు( మెకానిక్) 150 కేజీల బియ్యాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ముసునూరు నరేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వరంగల్ ఫొటో జర్నలిస్టులు తెలంగాణకే ఆదర్శం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వివిధ దినపత్రికల్లో పనిచేస్తున్న వరంగల్ ఫొటో జర్నలిస్టులు తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శమని టీయూడబ్ల్యూజే(హెచ్-143) హనుమకొండ జిల్లా శాఖ సభ్యులు కొనియాడారు. కాంపిటేషన్ ఏదైనా... ఎక్కడైనా... వరంగల్ ఫొటో జర్నలిస్టులు గెలిచి నిలువడం తథ్యమన్నారు. ఇప్పటికే అనేక సందర్భాల్లో బహుమతులు గెలుచుకున్న వరంగల్ ఫొటో జర్నలిస్టులు మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఉత్తమ ఫొటో జర్నలిస్టుల అవార్డుల కార్యక్రమం నిర్వహించగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవవర్మ చేతుల మీదుగా వరంగల్ జిల్లాలోని ఫొటో జర్నలిస్టులు వీరగోని హరీష్, గొట్టె వెంకన్న, దాసరి శ్రీనివాసులు అవార్డులను అందుకున్నారు. ఈసందర్భంగా టీయూడబ్ల్యూజే (హెచ్-143) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ బాలసముద్రం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మస్కపురి సుధాకర్, అర్షం రాజ్ కుమార్. ప్రెస్ క్లబ్ కోశాధికారి బోళ్ల అమర్, ఉపాధ్యక్షులు బొడిగే శ్రీనివాస్, జనగాని ఆంజనేయులు, మాడ నర్సయ్య, రమేష్, దిలీప్ తదితరులు శాలువాలు కప్పి వారిని ఘనంగా సత్కరించారు.

# సర్పంచ్‌గా అవకాశం ఇవ్వండి

## బానోత్ వీరేందర్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఏబీ తండా పరిధిలోని ఉట్టి తండా గ్రామానికి చెందిన బానోత్ వీరేందర్ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచి అభ్యర్థిగా పోటీలో ఉంటానని, అవకాశం కోసం ఎదురుచూస్తున్నానని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నందున వారి ప్రోద్బలంతోనే తాను గెలుస్తానని ఆయన నమ్మకంగా ఉన్నానని పేర్కొన్నారు. తాను నమ్ముకున్న రైతులు తనకు ఓటేస్తారని, బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో ప్రజలకు సేవ చేయాలనే పట్టుదలతో ఉన్నానని వీరేందర్ అభిప్రాయపడ్డారు. ప్రజల కనీస అవసరాలు అయినటువంటి తాగునీరు, విద్యుత్, రోడ్లు, పాఠశాలలు, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి ప్రాథమిక అవసరాలను అందించడానికి పాటుపడుతానన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు అర్హులకు చేరేలా చూడాలని, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. కాబట్టి, రానున్న ఎన్నికల్లో ప్రజాసేవ చేయడానికి ఎదురుచూస్తున్న తనను గ్రామ ప్రజలు గుర్తించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని గ్రామ ప్రజల ఆశీర్వాదం తనకు ఎల్లవేళలా ఉండాలని కోరారు.

# ఈహెచ్ఎంఐఎస్ పోర్టల్‌పై అవగాహన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ మురళీధర్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాలో ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు అందరికీ ఈహెచ్ఎంఐఎస్ (e-HMIS,) పోర్టల్ లో రోజువారి ఓపీ పేషెంట్స్ వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని, అదేవిధంగా పేషెంట్స్ ఆరోగ్య వివరాలను వైద్యాధికారులు పరిశీలించిన వివరాలను నమోదు చేస్తూ, ల్యాబ్ వివరాలతో పాటు మందుల వివరాలను కూడా పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ విజయకుమార్, డాక్టర్ శ్రవణ్ కుమార్, కేవీ రాజు హెల్త్ ఎడ్యుకేటర్, డీపీఓ నీలోహన, డీడీఎం రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ లో ఈ నెల 21న నిర్వహించే రక్తదాన శిబిరం పోస్టర్ ను హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆవిష్కరించారు. స్వతంత్ర సమరయోధులు షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 94వ వర్ధంతి పురస్కరించుకొని సంవేదన-2లో భాగంగా నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్స్ ఆక్టివిటీస్ (నిఫా), యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ ఆధ్వర్యంలో మూడు రక్తదాన శిబిరాల నిర్వహణకు సంబంధించిన పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిఫా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కే.యాదవ రాజు, సామాజిక వేత్త టీ.వి అశోక్ కుమార్, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్, వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), కానిస్టేబుల్ బొట్టు కమలాకర్, కోలా రాజేష్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్, అలువల పృథ్వీ, ఉప్పరపల్లి రాజ్ కుమార్, మునిగాల రాంప్రసాద్, ఊరటి రవికుమార్, సృజన, జ్యోతి, భావన, బిటుకూరి యాకయ్య, పాలకుర్తి విష్ణు, ఎస్.కె ముస్తఫా, లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ (హైకోర్ట్ అడ్వకేట్), యాద రవికుమార్, చెలిమల్ల అశోక్ కుమార్, తూనం రాము, సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్, మండల భూపాల్, మోడెం రాజశేఖర్ గౌడ్, నాగవెల్లి కార్తీక్ పాల్గొన్నారు.

# సీఎం, ఎమ్మెల్యే చిత్ర పటాలకు పాలాభిషేకం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లు, షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ బిల్లులను ఆమోదించినందుకుగాను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు కెఆర్ నాగరాజుల ఫోటోలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాశిబుగ్గ చౌరస్తాలో..



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ కాశిబుగ్గ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు కూడా వేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య పాల్గొన్నారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, బసవరాజ్ శ్రీమాన్, జన్ను రవి, గోరంటాల రాజు, మాజీ కౌన్సిలర్ ధూపం సంపత్, జిల్లా యూత్ అధ్యక్షులు పరమేశ్వర్, నాయకులు తోట బాలరాజు పాల్గొన్నారు.

# కడియం శ్రీహరిని విమర్శించే నైతిక హక్కు లేదు



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుర్రప్ర ప్రసాద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, వినయ భాస్కర్ లకు విమర్శించే నైతికత లేదన్నారు. ఘనపూర్ లో జరిగిన సీఎం సభలో కడియం శ్రీహరికి ఎనిమిది వందల కోట్ల నిధులను సీఎం రేవంత్ రెడ్డి ఇవ్వడాన్ని జీర్ణించుకోలేక మాజీ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరిపై అవాకులు, చేవాకులు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తను అధికారంలో ఉన్నప్పుడు వసూళ్ల రాయుడిగా పేరుతెచ్చుకని ఇప్పుడు కడియం శ్రీహరిపై నిందలు వేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మార్కెట్ డైరెక్టర్ బొడ్డు కుమార్, ఎంపీటీసీలు తోట నాగరాజు, జాలి ఆపు వనమాల, కొను రాజు, ఎన్నారై రామ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, లెనిన్, పీఏసీఎస్ డైరెక్టర్, బీసీ సెల్ అధ్యక్షుడు గంట రాజ్ కుమార్, సదానందం, జాలిగాపు దుర్గయ్య, యామిని, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని విస్మరించిన బడ్జెట్

## టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అశోక్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణలో ప్రభుత్వ బడుల వసతుల కల్పన విషయంలో దేశవ్యాప్తంగా 36 రాష్ట్రాల్లో 32వ స్థానంలో, నాణ్యమైన విద్య, సమర్థవంతమైన బడుల నిర్వహణలో 27వ స్థానంలో ఉందని తెలంగాణ విద్యా కమిషన్ వెల్లడించింది. ఈ పరిస్థితిని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండో బడ్జెట్‌లో విద్య రంగానికి సరిపడా నిధుల కేటాయింపు జరగలేదని టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అశోక్ విమర్శించారు. గత ఏడాది విద్యకు 21,292 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది కేవలం 0.26 శాతం పెరుగుదలతో 23,108 కోట్ల రూపాయలు (మొత్తం బడ్జెట్ 3,04,965 కోట్లలో 7.57 శాతం) మాత్రమే కేటాయించారు. అయితే, పెరిగిన ధరలు, ద్రవ్యోల్బణం దృష్ట్యా ఈ పెరుగుదల తక్కువేనని స్పష్టమవుతోంది. ఉప ముఖ్యమంత్రి తన ప్రసంగంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ గురించి ప్రస్తావించారని, కానీ 18,259 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 4,843 ఉన్నత పాఠశాలల పరిస్థితి గురించి ఎలాంటి చర్చ జరగలేదని పేర్కొన్నారు. ఈ పాఠశాలలు నిధుల కొరతతో కష్టాలు ఎదుర్కొంటున్నాయి. అంతేగాక, 662 గురుకులాలకు స్వంత భవనాలు లేవని చెప్పినప్పటికీ, వాటి నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించలేదు. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో విద్యారంగ అభివృద్ధికి తగిన ప్రాధాన్యత లభించలేదని, ప్రభుత్వ విద్యా వ్యవస్థ పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతోందని ఆయన పేర్కొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

## ఏఐఎస్ బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-2026 రాష్ట్ర బడ్జెట్ రూ. 3,04,956లో విద్యా రంగానికి కేవలం రూ.23,108 కోట్లు (7.57శాతం) మాత్రమే నిధులు కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో విద్యారంగానికి తీరని అన్యాయం చేసిందని ఏఐఎస్ బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించాలని అనేక సందర్భాలలో ప్రభుత్వానికి డిమాండ్ చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా గత ప్రభుత్వాల మాదిరిగానే విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించి, తీవ్ర నిర్లక్ష్యం చేసిందని హకీమ్ నవీద్ ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల, పేరుకుపోయిన కొన్ని వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్ మెంట్ బాకీలు ఈ ప్రభుత్వ హయాంలో తీరుతాయని ఎన్నో ఆశలు పెట్టుకున్న సందర్భంలో, ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులో ఫీజు రీయింబర్స్ మెంట్ ఊసే లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బడ్జెట్ ను సవరించి విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించి, పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ కుప్రత్యేక నిధులను కేటాయించాలని హకీమ్ నవీద్ డిమాండ్ చేశారు.

# ఆ తరహా పాత్ర వస్తే చేయనని చెప్పను..

'అర్జున్‌రెడ్డి' సినిమాలో కథానాయిక షాలినీ పాండే పోషించిన 'ప్రీతి' పాత్రను ఇష్టపడని ప్రేక్షకుడు ఉండడు. ఓ విధంగా ఆ సినిమా విజయంలో ఆ పాత్ర ప్రభావం చాలా ఉంది. ఆ తర్వాత మళ్లీ ఆ స్థాయి పాత్ర షాలినీకి రాలేదనే చెప్పాలి. అయితే.. రీసెంట్‌గా ఆమె 'డబ్బా కార్టెల్' వెబ్‌సిరీస్‌లో నటించారు. ఆ సిరీస్ ఓటీటీలో పెద్ద హిట్. అందులో బలమైన మహిళగా కనిపించి, ప్రశంసలందుకుంటున్నది షాలినీ పాండే. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో 'మరోసారి 'అర్జున్‌రెడ్డి' లాంటి సినిమాలో ప్రీతి తరహా పాత్ర చేయాల్సివస్తే చేస్తారా?' అని ఓ విలేకరి అడగ్గా.. 'నేను కెరీర్ ప్రారంభించిన తొలినాళ్లలో చేసిన సినిమా అది. ఇప్పుడు ఆ పాత్ర గురించి ఆలోచిస్తే అమాయకంగా అనిపిస్తుంది. ఆ పాత్రను ఇంకాస్త బలంగా రాయొచ్చేమో అనుకుంటున్నా. మరోసారి ఆ తరహా పాత్ర వస్తే చేయనని చెప్పను కానీ.. దర్శకుడితో మాట్లాడి కొన్ని మార్పులు చేయించుకొని అప్పుడు చేస్తా. అంతేకాదు, అప్పటికంటే ఇప్పుడు నటిగా పరిణితి చెందాను కాబట్టి ఇంకాస్త భిన్నంగా చేయడానికి ప్రయత్నిస్తా.' అంటూ చెప్పుకొచ్చింది షాలినీ పాండే.






# 'చిరు' ముద్దు

తరాలు మారిన మెగాస్టార్ క్రేజ్ ఏమాత్రం తగ్గదు. ఆయన సినిమాలు ఎప్పటికీ ప్రేక్షకులకి మంచి వినోదం పంచుతూనే ఉంటాయి. మెగాస్టార్ చిరంజీవి జర్నీ దాదాపు ఐదు దశాబ్దాలుగా సాగుతుంది. చిరంజీవి 1978లో నటుడిగా మారారు. పునాదిరాళు చిత్రంలో నటించి నటుడిగా మారిన చిరంజీవి ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేదు. మెగాస్టార్‌గా ఇండస్ట్రీని ఏలుతున్నారు. ఇప్పటికీ చిరంజీవి యువకులకి పోటీగా సినిమాలు చేస్తూ ప్రేక్షకులని అలరిస్తున్నారు. ఇక ఆయన అభిమాన గణం రోజు రోజుకి పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ఆయనకి మన ఇండియాలోనే కాదు విదేశాలలోను భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అమెరికాలో ఉన్న డాక్టర్ ఇస్మాయిల్ సుహైల్ పెనుకొండ మెగాస్టార్ చిరంజీవికి డై హార్డ్ ఫ్యాన్ కాగా, ఆయన తన టెస్లా కారుకు 'మెగాస్టార్' అని వచ్చేలా నంబర్ ప్లేట్ వేయించుకున్నాడు. టోటల్ టెక్సాస్ లో చూస్తే ఈ నంబర్ ప్లేట్ ఉన్న కారు ఇదొక్కటే ఉంటుంది. మనోడు చిరంజీవిపై ఎప్పటికప్పుడు తన అభిమానం చూపిస్తూ ఉంటారు. ఇక చిరంజీవి రీసెంట్‌గా యూకే పార్లమెంట్‌లో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకోవడానికి లండన్ వెళ్లారు. ఆయన హీత్రూ విమానాశ్రయంలో దిగగానే, అభిమానులు, తెలుగు ప్రవాసులు చిరుకి ఘన స్వాగతం పలికేందుకు అక్కడికి భారీగా చేరుకున్నారు. అయితే ఒక మహిళా అభిమాని చిరంజీవి బుగ్గపై ముద్దు పెట్టుకోవడం ద్వారా తన అభిమానాన్ని చాటుకుంది.. ఇప్పుడు ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చిరంజీవిని ముద్దు పెట్టుకున్న మహిళ కుమారుడు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, "చిన్నప్పుడు, నేను చిరంజీవిని కలవాలని పట్టుబట్టేవాడిని. ఈరోజు, నా తల్లిని అతనిని కలవడానికి తీసుకెళ్లాను" అని రాసుకొచ్చారు. ఈ పిక్ ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుంది. అయితే మహిళా అభిమాని ముద్దు పెడుతున్న సమయంలో చిరు చిన్న చిరునవ్వు నవ్వడం ఫోటోలో గమనించవచ్చు. ఇక బుధవారం సాయంత్రం చిరంజీవిని యూకే పార్లమెంట్‌లో జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించనున్నారు. నాలుగు దశాబ్దాలుగా సినిమా, సామాజిక సేవకు ఆయన చేసిన కృషికి గాను ఆయనకి ఈ గుర్తింపు దక్కింది.

# ఏఎన్నార్ దత్తపుత్రుడు..

టాలీవుడ్ ఇండస్ట్రీలో అక్కినేని ఫ్యామిలీకి ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. అయితే అక్కినేని నాగేశ్వరరావు ఫ్యామిలీకి సంబంధించి నెట్టింట అనేక వార్తలు హల్‌చల్ చేస్తుంటాయి. అక్కినేని నాగేశ్వరరావుకు నాగార్జున కాకుండా ఇంకో కొడుకు, ముగ్గురు కూతుళ్లు ఉన్న విషయం తెలిసిందే. అయితే అక్కినేని నాగేశ్వరావు మనవడు, హీరో సుమంత్. అక్కినేని నాగేశ్వరరావు పెద్ద కూతురు సత్యవతి యార్లగడ్డ సురేంద్రల కొడుకు సుమంత్ యార్లగడ్డ కాగా, సుమంత్ ని అక్కినేని నాగేశ్వరరావు దత్తత తీసుకున్న విషయాన్ని సుమంత్.. శ్రీదేవి డ్రామా కంపెనీ షోలో రివీల్ చేసి అందరికి పెద్ద షాక్ ఇచ్చాడు. తాజా ఎపిసోడ్‌కి సుమంత్ గెస్ట్ గా వచ్చారు. ఇందుకు సంబంధించిన ప్రోమో రిలీజ్ కాగా, ఈ షోలో ఫాదర్స్ గురించి ప్రస్తావన రాగా సుమంత్ మాట్లాడుతూ.. నాకు ఇద్దరు ఫాదర్స్ ఉన్నారు. నా బర్త్ ఫాదర్ సురేంద్ర కాగా, మా తాత గారు అక్కినేని నాగేశ్వర రావు గారు నన్ను దత్తత తీసుకున్నారు అని అన్నారు. ప్రాక్టికల్ గా అయితే ఆయనే నా ఫాదర్ అని తెలిపారు. ఇప్పుడు ఈ విషయం తెలియడంతో అందరు ఆశ్చర్యపోతున్నారు. కొడుకులు, కూతుళ్లు ఉన్నా సుమంత్ ని నాగేశ్వరరావు దత్తత తీసుకోవడం గొప్ప విషయం అంటూ కొందరు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. అసలు ఈ విషయంపై పూర్తి క్లారిటీ రావాలంటే ఫుల్ ఎపిసోడ్ ప్రసారం అయ్యే వరకు వేచి చూడాల్సిందే. కాగా, అక్కినేని హీరో సుమంత్.. టాలీవుడ్ సినీ పరిశ్రమలో పలు చిత్రాలు చేసి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు. హీరోగా ఒకప్పుడు స్టార్ స్టేటస్ ను సొంతం చేసుకొని, ఆ తర్వాత వరుస ఫ్లాప్ లు.. ఎదురవడంతో క్యారెక్టర్ ఆర్టిస్టు పాత్రలు.. చేస్తూ కెరియర్ ను ముందుకు తీసుకెళుతున్నారు. సుమంత్ ప్రేమకథ సినిమాతో హీరోగా ఎంట్రీ ఇవ్వగా ఆ తర్వాత యువకుడు, సత్యం, గౌరీ, గోదావరి, మధుమాసం, గోల్కొండ హై స్కూల్, మళ్ళీ రావా.. వంటి సూపర్ హిట్ చిత్రాలు కూడా చేశాడు.



# స్టార్ హీరోతో ప్రేమలో ..



సినిమా ఇండస్ట్రీలో చాలా మంది పెళ్లి చేసుకొని కొత్త జీవితాలను ప్రారంభిస్తున్నారు. అలాగే కొంతమంది లవ్ ఎఫైర్స్ తో వార్తల్లో నిలుస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలో స్టార్ డమ్ అందుకుంటున్న ఈ బ్యూటీ.. అప్పుడే హీరోతో ప్రేమలో పడటంతో అది కూడా ఓ సీనియర్ హీరోతో ప్రేమాయణం సాగించడంతో అభిమానులు కాస్త నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దూసుకుపోతున్న యంగ్ హీరోయిన్స్ వారిలో నిధి అగర్వాల్ ఒకరు. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ కు వచ్చింది ఈ వయ్యారి భామ. ఈ ముద్దుగుమ్మ తన అందంతో కుర్రకారును కట్టిపడేసింది. అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్య హీరోగా నటించిన సవ్యసాచి సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది నిధి. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ సినిమా అంతగా ఆకట్టుకోలేకపోయింది. ఆతర్వాత అక్కినేని అఖిల్ తో మజ్ను అనే సినిమా చేసింది. ఆ సినిమా కూడా నిరాశపరిచింది. దాంతో ఈ బ్యూటీకి ఇక అవకాశాలు రావడం కష్టమే అని అనుకున్నారు అంతా.. ఆతర్వాత డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ తెరకెక్కించిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో హిట్ అందుకుంది. ఇక ఈ సినిమాలో నటనతో పాటు గ్లామర్ పరంగాను ఆకట్టుకుంది. డబుల్ ఇస్మార్ట్ సినిమాలో నిధి అందాలకు కుర్రకారు ఫిదా అయ్యారు. ఈ సినిమా హిట్ అయినా కూడా నిధికి అంతగా ఆఫర్స్ రాలేదు. ఇక ఇప్పుడు ఈ భామ వరుసగా రెండు భారీ సినిమాలు చేస్తోంది. కెరీర్ ఖతం అయ్యింది అని అనుకునేలోగా ఇద్దరూ బడా స్టార్స్ సినిమాలో ఛాన్స్ అందుకుంది. నిధి అగర్వాల్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న హరిహరవీరమల్లు సినిమాలో హీరోయిన్ గా చేస్తోంది. అలాగే ప్రభాస్ మారుతి దర్శకత్వంలో వస్తున్న రాజా సాబ్ సినిమాలోనూ నటిస్తుంది. అయితే నిధి అగర్వాల్ తమిళ్ హీరో శింబుతో ప్రేమలో పడిరదని ఆమధ్య వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అప్పట్లో నిధి ఆ రూమర్స్ ను కొట్టిపారేసింది. ఇప్పుడు మరోసారి నిధి శింబు ప్రేమాయణం గురించి గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవలే టి నగర్‌లోని శింబు ఇంటికి మకాం మార్చినట్టు సమాచారం. ప్రస్తుతం ఇరు కుటుంబాలను ఒప్పించే పనిలో ఉన్నారట. త్వరలోనే వీరి పెళ్ళికి గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. శింబు గతంలో ఇద్దరు ముగ్గురు హీరోయిన్స్ తో లవ్ ఎఫైర్స్ నడిపిన విషయం తెలిసిందే.. అయితే శింబుని పెళ్లి చేసుకుంటే కెరీర్ క్లోజ్ అవుతుందని కొందరు ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





# గడీలు దాటి బయటికి రా..

- ఎంజీఎంపై దృష్టి సారించు
- మంత్రి సురేఖకు బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ విజ్ఞప్తి
- ఆత్మగౌరవ పోరాటం పేరుతో మహాధర్నా

**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక మంత్రి కొండా సురేఖ గడీలు దాటి బయటికి రావాలని, ఎంజీఎం దుస్థితిపై దృష్టి సారించాలని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ విజ్ఞప్తి చేశారు. నిన్ను నమ్మి ఎమ్మెల్యేగా గెలిపించి మంత్రి పదవి అందిస్తే నీవు ఒరగబెట్టింది ఏమిటి అంటూ ప్రశ్నించారు. ఆస్పత్రిలోని దయనీయస్థితిపై వరంగల్ ప్రజల ఆత్మగౌరవ పోరాటం పేరుతో బుధవారం ఎంజీఎంలో బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ పాలకుల నిర్లక్ష్యంపై నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్‌రెడ్డి ఓ అసమర్థ నాయకుడని, ఆయన పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని రవికుమార్ విమర్శించారు. వరంగల్‌ను రాష్ట్ర రెండో రాజధాని చేస్తానని ఊకదంపుడు ప్రచారం తప్ప చేసిందేమీలేదన్నారు. ఉత్తర తెలంగాణకే పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎంలో సమస్యలు తాండవిస్తుంటే ఒక్కసారైనా ఆస్పత్రిని విజిట్ చేశారా అంటూ సూటిగా ప్రశ్నించారు. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలకు కమీషన్లు, ఆధిపత్య పోరు తప్ప ఎంజీఎంను బాగు చేయాలన్న సోయి ఏమాత్రం లేదని విమర్శించారు. ఎంజీఎంలో సరైన వైద్యులు లేక వైద్యం అందని ద్రాక్షగానే మారిందన్నారు. ఏళ్లు గడుస్తున్నా ఖాళీలను భర్తీ చేయకపోవడాన్ని రవికుమార్ తప్పుబట్టారు. సిబ్బంది కనీసం సమయపాలన పాటించడం లేదన్నారు. ఉత్తర తెలంగాణకే పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎంకు ఇంచార్జి సూపరింటిండెంట్‌తోనే కాలం వెల్లదీస్తున్నారని, దాంతో వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రవికుమార్ ఆరోపించారు. ఎంజీఎంలో సరిపడా బెడ్లు లేకపోవడంతో ఒకే బెడ్డుపై ఇద్దరు, ముగ్గురుని పడుకోబెట్టాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఎక్కడపడితే అక్కడే బయో వ్యర్థాలను పారేస్తున్నారన్నారు. మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయన్నారు. పైకప్పు పెచ్చులూడుతోందన్నారు. ఫ్యాన్లు పనిచేయకపోవడంతో కొందరు ఇంటినుంచి తెచ్చుకుంటున్నారని వాపోయారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి ఉంటే సీఎంపై ఒత్తిడి పెంచి ఎంజీఎంకు భారీగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

### మౌలిక వసతులు కరువు..

ఈ మహాధర్నాకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎంజీఎంలో కనీసం వీల్‌చైర్లు, స్ట్రెచర్లు, బెడ్లు, ఆక్సీజన్, 2డీ, ఈసీజీ లాంటి మౌలిక వసతులు కూడా లేవని విమర్శించారు. వరంగల్ జిల్లా నుంచి ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ ఏం లాభం అంటూ ప్రశ్నించారు. సీఎం వద్దకు వెళ్లి పేదల ఆస్పత్రి అయిన ఎంజీఎం దుస్థితి వివరించలేని దద్దమ్మలు వారు అంటూ ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అయిన సురేఖ ఒక్కరోజైనా ఆస్పత్రి గురించి ఆలోచించిన పాపాన పోలేదన్నారు. ఆమెకు కావాల్సింది ఓట్లు, రాజభోగాలు మాత్రమేనని, ప్రజలు ఏమైనా ఆమెకు పట్టదని, అవసమైతే తప్ప గడి నుంచి బయటకు రారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్, కంభంపాటి పుల్లారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, చాడ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరి శంకర్, డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, పదాధికారులు, మండల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఫెయిల్

- 15 నెలల్లో ఏ వర్గానికి మేలు చేయలేదు
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్ అయ్యిందని, 15 నెలల్లో ఏ వర్గానికి మేలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. బుధవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వరంగల్ జిల్లా ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని దుయ్యబట్టారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంటలు ఏప్రిల్, మే చివరి వరకు పండుతాయని, అప్పటి వరకు సాగు నీరు అందించాలని కోరారు. నాడు కేసీఆర్ ఏర్రటి ఎండలో సైతం సాగునీరు అందించారని గుర్తు చేశారు. జిల్లాకు కరువు వచ్చిందన్నారు. మెయింటెనెన్స్ లేకనే దేవాదుల నీరందడం లేదన్నారు. ఎస్సారెస్పీ నీరు కూడా మార్చి వరకే షెడ్యూల్ ఉందని, ఇలా అయితే జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో పంట ఎండి పోయే ప్రమాదం ఉందన్నారు. దేవాదుల మూడో దశ పనులు 95 శాతం బీఆర్ఎస్ హయాంలోనే పూర్తి అయ్యాయన్నారు. మీరొచ్చి సున్నాలేసి, మోటార్లు ఆన్ చేసుడే ఉండే అన్నారు. ఈ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఏడాది క్రితం ప్రారంభించాల్సిన దేవాదులను ఇప్పటి వరకు ప్రారంభించకుండా రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ నేతలకు విషయ పరిజ్ఞానం లేదు.. చిత్తశుద్ధి అంతకన్నా లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, పార్టీ నియోజకవర్గ కన్వినర్ తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్, పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినికాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, సీనియర్ నాయకులు సల్వాజీ రవీందర్ రావు, నయీమొద్దీన్, బండి రజినీకుమార్, నాయకులు చాగంటి రమేష్, పోలపెల్లి రామ్మూర్తి, ఖలీల్, శ్రీకాంత్ చారి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే బడ్జెట్

**- మంత్రి కొండా సురేఖ**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి అయిన భట్టి విక్రమార్క నేతృత్వంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి బుధవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ తెలంగాణ ప్రాంత ప్రజల అవసరాలు, ఆకాంక్షలను ప్రతిబింభించేలా ఉందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. అవసరం మేరకు కేటాయింపులు చేయడం హర్షణీయం అన్నారు. ఒక వైపు అభివృద్ధి.. మరోవైపు సంక్షేమాన్ని సముతుల్యత చేస్తూ.. రాష్ట్ర బడ్జెట్ దిశానిర్ధేశం చేసేలా ఉందన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేకూర్చే విధంగా బడ్జెట్ రూపకల్పన జరిగిందన్నారు. ఉపాధి కల్పనకు ఊతం ఇస్తూ.. మహిళా సంక్షేమం, యువత, దళితులు, గిరిజనుల సంక్షేమానికి దిక్సూచిలా ఉందన్నారు. యావత్ తెలంగాణ సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలకు అద్దం పట్టేలా బడ్జెట్‌ను భట్టి విక్రమార్క రూపొందించడం ప్రశంసనీయమన్నారు. సవాళ్ళపై స్వారీ చేస్తూనే.. రాష్ట్ర బడ్జెట్ తెలంగాణ ప్రాంత ప్రజల ఆర్థిక స్థిరత్వానికి బాటలు వేస్తోందన్నారు. అసెంబ్లీ బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టి విక్రమార్కకు, శాసనమండలిలో ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్ బాబుకు సురేఖ అభినందనలు తెలిపారు.



# ఎన్సీసీతో ఉజ్వల భవిష్యత్తు

**మర్కజి ఉన్నత పాఠశాల హెచ్ఎం రామారావు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యార్థి స్థాయిలోనే ఎన్సీసీలో చేరడం ద్వారా మంచి క్రమశిక్షణ, దేశభక్తి అలవడుతుందని, సైనిక శిక్షణ కూడా పొందవచ్చని ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీవీ రామారావు, అసోసియేట్ ఎన్సీసీ ఆఫీసర్ డాక్టర్ కె.వాసు అన్నారు. బుధవారం హనుమకొండలోని ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాలలో బుధవారం 2025-26 సంవత్సరానికి గాను పదో బెటాలియన్ ఆర్మీ వింగ్ ఎన్సీసీ ప్రవేశాలకు ఎంపిక జరిగింది. దేహ దారుఢ్య పరీక్షలు, ఫిట్ నెస్, వ్రాత పరీక్షల ద్వారా విద్యార్థులను ఎంపిక చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 10వ బెటాలియన్ ఆర్మీ అధికారులు సుహాస్ కదం కుమార, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఎంపికైన క్యాడేట్స్ కి రెండు సంవత్సరాల పాటు వివిధ అంశాలలో శిక్షణ ఇవ్వనున్నారు. డ్రిల్లు, పరేడ్, వెపన్ ట్రైనింగ్, క్యాంప్ ట్రైనింగ్, సైనిక శిక్షణ మొదలైన అంశాలలో సర్టిఫికెట్ ఎగ్జామ్ నిర్వహించనున్నారు



# కేయూ వీసీని కలిసిన సీపీ

కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ కర్నాటి ప్రతాపరెడ్డిని ఆయన చాంబర్ లోనే బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీకి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. **-వరంగల్ వాయిస్, క్రైం**

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com